కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 22 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 28, బెండకాయ 18, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 60, కాకరకాయ 26, బీరకాయ 23, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 45, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 45, గోరుచిక్కుడు 23, బీట్ రూట్ 35, క్యాప్సికం 50, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 15, సొరకాయ 11, పొట్లకాయ 13, కందగడ్డ 55, ఉల్లి పొరక 28 , ఉల్లిగడ్డ 39, మామిడి కాయ(1) 15 నుంచి 20, అరటి కాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 65, గుమ్మడికాయ 23, నిమ్మకాయలు(12) 40 నుంచి 50, మునగ కాయ(1) 6 నుంచి 8, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 320, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

నేటి నుంచి స్వామి చిదాత్మానంద ప్రవచనాలు

అల్లాపూర్, ఆగస్టు 22: రాయల్ గార్డెన్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు విజయ రహస్యంపై స్వామి చిదాత్మానంద ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయం సాధించడానికి ఏది అవసరం, అదృష్టమా? లేక దేవుడా? అనే విజయ రహస్యంపై స్వామి చిదాత్మానంద ప్రవచానాలు ఉంటాయన్నారు. మూడు రోజులపాటు ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 8 గంటలకు వరకు ప్రవచనం ఉంటుందన్నారు.

24న వాహనాల మెగాలోక్ ఆదాలత్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 22 : అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 24న వివిధ కేసులో పట్టుబడిన వాహనాలను సరైన పత్రాలను సమర్పించి పరిష్కరించుకునేందుకు మెగాలోక్ ఆదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డ్రంగన్‌డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వాహనదారులు సంబంధించిన పత్రాలైన ఆధార్‌కార్డు, ఆర్‌సీ, డ్రైవింగ్‌లైసెన్స్‌ను పొందుపరిచి జరిమానాలతో కేసులను పరిష్కరించేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7337469394, 8143588616 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా వినోద్ జాదవ్

వినోద్‌జాదవ్

జగద్గిరిగుట్ట, ఆగస్టు 22 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా వినోద్ జాదవ్ ఎంపికయ్యారు. ఈమేరకు రంగారెడ్డినగర్ బ్రైట్‌కాన్సెప్ట్ హైస్కూల్‌లో గురువారం సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకుని కార్యాచరణపై చర్చించారు. ఉన్నత ప్రమాణాలు నెలకొనెలా చూడాలని పలువురు సూచించారు. చైర్మన్‌గా కోల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారిగా శ్రీశైలం ఎంపిక యాయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు ఆంజనేయులు, గిరి, నర్సింహులు, నందారెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, బాలరాజు, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విషం తాగిన గృహిణి

చికిత్స పొందుతూ మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 22: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ గృహిణి విషం తాగి.. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీ భగత్‌సింగ్‌నగర్ నివసిస్తున్న బండి దవ్య కృపా (38) భర్త ప్రేమ్‌కుమార్‌లో కలిసి నివసిస్తూ... హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. తరచూగా శ్వాస సమస్య, బాడీ పెయిన్స్, జ్వరం, మూత్ర సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంది. చికిత్స నిమిత్తం పలు వైద్యశాలలకు తిరిగి చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో మనస్థాపం చెందింది. దీంతో ఆమె ఈనెల 14న ఇంట్లో విషం తాగింది. అనంతరం ఈ విషయాన్ని భర్తకు ఫోన్‌లో చెప్పింది. బంధువుల సహకారంతో వెంటనే ఆమెను సమీపంలోని వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా.. గురువారం(ఈనెల 22న) మృతి చెందింది. మరిది నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణులు...
- గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి మహా ధర్నా
- ఎద్దు ఏడ్చిన ఎవుసం... రైతు ఏడ్చిన రాజ్యం నిలువదని ఉద్ఘాటన


గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

దుండిగల్, ఆగస్టు 22 : రాష్ట్రంలోని రైతులందరికీ ఎటువంటి ఆంక్షలు విధించకుండా ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని వర్తింపజేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) పిలుపు మేరకు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆదేశానుసారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ముందుగా దుండిగల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు, అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించి అర్హులైన ప్రతిఒక్క రైతుకు రెండులక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ తహసీల్దార్ మతిన్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలనే ఆలోచనతో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డును సాకుగా చూపి రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఎన్నికల ముందు గుర్తుకురాని రేషన్ కార్డులు ఎన్నికల తరువాత ఇప్పుడు గుర్తుకొస్తున్నాయా...? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వం రైతులకు చేసిన ద్రోహమేనన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతినిత్యం బ్యాంకుల చుట్టూ రైతులు తిరగాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. రైతులను ఏడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొట్టుకు పోవడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా 'ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం' నిలిచిన ఉదంతాలు చరిత్రలో ఎక్కడా కనిపించవని ఉద్ఘాటించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట సహకార సంఘం బ్యాంకులో రూ.3 కోట్ల రుణమాఫీ చేయాల్సి, ఉండగా కేవలం రూ.4లక్షల రూపాయలు మాత్రమే రుణమాఫీ చేసిందని దుయ్యబట్టారు.ఇలా కొందరికి మాత్రమే రుణమాఫీ చేసి రైతులు అందరికీ రుణమాఫీ చేశామంటూ ప్రభుత్వం ప్రచారం నిర్వహించడం సిగ్గుచేటన్నారు. తూ.తూ మంత్రంగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకోకుండా,అర్హులైన ప్రతి ఒక్కరికి బేషరతుగా రుణమాఫీని వర్తింపుజేయాలని డిమాండ్ చేశారు .ఒకే వేళ ప్రభుత్వ వైఖరి ఇలాగేకొనసాగితే రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేసేవరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలోనియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు,చైర్మన్‌లు,కార్పొరేటర్లు, కౌన్సిలర్లు,పీఏసీఎస్ డైరెక్టర్లు,రైతు సంఘాల నాయకులు,జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షులు,మహిళా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన రవాణా అందించేందుకే రోడ్ల నిర్మాణం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్ కాలనీ డివిజన్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్

మియాపూర్, ఆగస్టు 22: ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ప్రజలు వాహనారులకు మెరుగైన రవాణాను అందించేందుకు సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసీ వనం వద్ద రూ.30 లక్షలతో రోడ్డు విస్తరణ, ఫేజ్-1 కాలనీలో రూ.27లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ క్షేత్రంగా ఉన్న నియోజకవర్గంలో ఇప్పటికే పలు లింక్ రహదారులను అందుబాటులోకి తీసుకువచ్చామని, ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో మరిన్ని ప్రాంతాల్లో వాటి నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో అంతర్గత రహదారులను పకడ్బందీగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఫ్లైఓవర్‌లు, లింక్ రహదారులతో ట్రాఫిక్‌కు ఎంతో ఉపశమనం కల్పించినట్లు, ఇంకా వాటిని విస్తరించి శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు సహా పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అహర్నిషలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

-కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్‌కు చెందిన సుభద్ర కుమారుడు సుమంత్ ఇంజినీరింగ్ కళాశాల ఫీజు నిమిత్తం రూ.1,26,500 ఆర్థిక సాయాన్ని తన సొంత నిధుల నుంచి ఎమ్మెల్యే గాంధీ ఆర్థిక సాయాన్ని గురువారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు తన సంపూర్ణ తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, పదిమందికి సాయం చేసే దశకు చేరుకోవాలని ఎమ్మెల్యే గాంధీ ఆకాంక్షించారు.

ఘనంగా నల్లపోచమ్మ, ఎల్లమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన

గాజులరామారంలోని నల్లపోచమ్మ తల్లి,రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొన్న కూనశ్రీశైలంగౌడ్ తదితరులు

దుండిగల్,ఆగస్టు 22: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,గాజులరామారం సర్కిల్(డివిజన్) పరిధి, గాజులరామారంలోని నల్లపోచమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను ఘనంగా సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ ఆకాంక్షించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 7వ డివిజన్ పరిధి, రెడ్డీస్ ఎవెన్యూ కాలనీలోని శ్రీనాగవేంకటేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, స్థానిక కార్పొరేటర్ ప్రణయ యాదవ్, టీడీపీ నేత లీడర్ నర్సింహారెడ్డి పాల్గొని పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు జరిగిన హోమంలో పాల్గొన్నారు.

పీజీ డిప్లామా ఇన్ ఎల్లీ ఇంటర్వెన్షన్ ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: ఓయూ పరిధిలోని పీజీ డిప్లామా ఇన్ ఎల్లీ ఇంటర్వెన్షన్ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 12వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడవచ్చని సూచించారు.

ఎంసీఏ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని ఎంసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) (రెండేళ్ల కోర్సు) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 30 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

లా కోర్సుల్లో ఎన్ఐక్యూ కోటా ప్రవేశాలకు ఆహ్వానం

ఓయూ లా కళాశాలలో వివిధ కోర్సుల్లో నేషనల్ ఇంటిగ్రేషన్ కోటా (ఎన్ఐక్యూ)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులతో పాటు కాన్‌స్టిట్యూషనల్ లా, కార్పొరేట్ అండ్ సెక్యూరిటీస్ లా, లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ లా విభాగాల్లో ఎల్ఎల్ఎం (డే), ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిసొల్యూషన్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ ఎకానమిక్ లా, క్రిమినాలజీ అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ విభాగాల్లో ఎల్ఎల్ఎం (ఈ వినింగ్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు ఫారాలను వచ్చే నెల 10లోగా కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకొని యువకుడు మృతి

కుత్బుల్లాపూర్,ఆగస్టు 22 : అనుమానాస్పద స్థితిలో యువకుడు ఉరేసుకొని మృతి చెందిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. షాపూర్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.చంద్రారెడ్డికి చెందిన చిన్న కొడుకు జగదీశ్‌రెడ్డి(24) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. జగదీష్ కొన్ని తన వ్యక్తిగత సమస్యలతో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు, తన స్నేహితులకు వాట్సాప్ ద్వారా పంపించాడు. కుటుంబసభ్యులు, స్నేహితులు జగదీశ్ కోసం వెతుకుతున్న క్రమంలోనే కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ మైదానంలో చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందాడని వచ్చిన సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా జగదీశ్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూసాపేట ఏఎంహెచ్‌వో కార్తిక్‌కు శుభాకాంక్షలు

మూసాపేట సర్కిల్ ఏఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కార్తిక్‌ను కేపీహెచ్‌బీ కాలనీలోని శివశక్తి కల్చలర్ అసోసియేషన్ నేతలు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యాగ్రౌండ్‌లో చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రంగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కట్టా నర్సింగరావు, రామకృష్ణ, శ్రీనివాస్‌రావు, వెంకటసుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 22

ఎలక్ట్రానిక్స్‌తో ఉజ్వల భవిష్యత్

వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ దేవదాస్, అధ్యాపకులు

మేడ్చల్, ఆగస్టు 22: ఎలక్ట్రానిక్స్‌తో ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవచ్చని టెక్నాట్రాన్ కంపెనీ డైరెక్టర్ వికాస్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ ఆఫ్ రోబోటిక్ థింగ్స్' అనే అంశంపై నిర్వస్తున్న మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అంటే ఒక సబ్జెక్టు కాదని, అన్ని శాఖలకు సంబంధించిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవదాస్, ఈసీఈ హెడ్ రవీంద్రబాబు, కో ఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు నాయక్, సీఈవో అభినవ్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొరియర్‌లో వచ్చిన ఐఫోన్లను దొంగిలించిన డెలివరీ బాయ్

కొండాపూర్, ఆగస్టు 22:కొరియర్‌లో వచ్చిన సెల్‌ఫోన్లను డెలివరీ బాయ్ దొంగిలించిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. దీనికి సంబంధించిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఓ సంస్థ ఆర్డర్ చేసిన కొరియర్‌లో సెల్‌ఫోన్లు ఉన్నట్లు గ్రహించిన డెలివరీ బాయ్, అందులో నుంచి 10ఐఫోన్లను దొంగిలించి, ఏం ఎరుగనట్లు మిగతా వాటిని యధావిధిగా డెలివరీ చేశాడు. ఫోన్లను ఆర్డర్ చేసిన సంస్థ ఈ విషయాన్ని ఆలస్యంగా గ్రహించి, చందానగర్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. కాగా, కేసు వివరాలను చందానగర్ పోలీసులు గోప్యంగా ఉంచారు. డెలివరీ బాయ్ వివరాలను వెల్లడిస్తే తప్పించుకునే ఆస్కారం ఉందని, నిందితుడిని అదుపులోకి తీసుకున్న తర్వాత పూర్తి వివరాలను తెలియజేస్తామని చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు.

దోమలను లార్వా దశలోనే నియంత్రించాలి

జడ్సీ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి సర్కిల్ చెరువులో గుర్రపుడెక్క తొలగించే పనులను పరిశీలిస్తున్న జడ్సీ చౌహాన్

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 22: దోమలను లార్వా దశలోనే నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. గురువారం కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. చెరువుల్లో గుర్రపుడెక్కను ఆవాసాలుగా మార్చుకుని, దోమలు వృద్ధిచెందకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించే పనులను చేపట్టామన్నారు. మరోవైపు కాలనీలు, బస్తీల్లో లార్వా దశలోనే దోమలను నియంత్రించేందుకు ప్రజలకు అవగాహక కల్పించడంతోపాటు కాలనీల వారీగా షెడ్యూల్ ప్రకారం ఫాగింగ్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువు పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని అధికారులను ఆదేశించారు.. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

వందశాతం స్వచ్ఛతను సాధించడమే లక్ష్యం

ఎస్‌డబ్ల్యూఎం డీఈ శ్రీనివాస్

కూకట్‌పల్లి సర్కిల్‌లో గ్యాంగ్‌వార్ పనులను పరిశీలిస్తున్న ఎస్‌డబ్ల్యూఎం డీఈ శ్రీనివాస్

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 22: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో వందశాతం స్వచ్ఛతను సాధించే దిశగా.. గ్యాంగ్‌వార్ పనులను చేపడుతున్నట్లు సర్కిల్ ఎస్‌డబ్ల్యూఎం డీఈ వి.శ్రీనివాస్ అన్నారు. గురువారం సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో గ్యాంగ్‌వార్ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లోని ఖాళీ ప్రదేశాలు, పార్కులు, బస్టాండ్‌ల ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు గ్యాంగ్‌వార్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులందరూ కలిసి పనిచేయడం వల్ల ఆ ప్రాంతంలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా మార్చడం జరుగుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛ ఆటోలోనే చెత్త వేయాలని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారబోయడం తగదన్నారు. స్వచ్ఛ పరిసరాల కోసం ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీలు, ఎస్ఎస్ఎఫ్‌లు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై రేపు పరిష్కార వేదిక

కుత్బుల్లాపూర్, ఆగస్టు 22 : విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల 24వ తేదీన షాపూర్ నగర్ ఏడీఈ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఈ పి.వీరేశలింగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేదికలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, మెంబర్ కంజుమర్ ఎఫైర్‌లు హాజరవుతారని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 22: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో వచ్చే నెల 2వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 90004 44973, 79899 03001 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలు

మేడ్చల్, ఆగస్టు 22 : ఈఎంఆర్ఐలో డ్రైవర్, ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్) ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్‌షాహిద్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టులకు 10వ తరగతి పాసై, 23 నుంచి 35 ఏండ్ల లోపు ఉండాలని, ఎల్ ఎంవీ బ్యాడ్జ్ నంబరు కల్గి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈఎంటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ(బీజడ్సీ), బీఎస్సీ నర్సింగ్, ఫార్మసీ విద్యార్హత కల్గి, 30 ఏండ్లలోపు ఉండాలని తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కింగ్ కోఠిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్